13-4-2000 ఆంధ్రప్రభ

36

# 'నందనవనం' కొందరికేనా?

**గతంలో తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న అన్నాదురై సాహసించి చెన్నైలో బీచ్ వెంబడి ఉన్న గుడిసెవాసులకు అక్కడే రెండు మూడు అంతస్తుల అపార్ట్‌మెంట్లు కట్టించి మిగిలిన బీచ్‌ను పర్యాటకుల కోసం అభివృద్ధి చేశాడు. మూసీ పరిసరవాసులు రెండేళ్లుగా ఇదే అభ్యర్థన చేస్తున్నారు. మాకు రెండంతస్తుల్లో, మూడంతస్తుల్లో ఉన్న అపార్ట్‌మెంట్లు కట్టించి తలా ఒక ఫ్లాట్ ఇవ్వండంటున్నారు. ఎవ్వరూ అహేతుకమనలేని ఈ సూచన ఎవరి చెవినా ఎందుకు పడడంలేదు?**



కె.బాలగోపాల్

హైదరాబాద్ నగర భాగ్యవిధాతలు రెండేళ్లకింద నందనవనం ప్రాజెక్టు గురించి మాట్లాడడం మొదలుపెట్టినప్పుడు దాని పూర్తి భావం ఎవ్వరికీ అర్థంకాలేదు. హైకోర్టులో కేసులు గట్టెక్కడానికి నగర పాలకులొక అబద్ధపు వ్యాఖ్యతో మొదలుపెట్టారు. అదేమిటంటే మూసీనదిలోని కాలుష్యాన్ని క్షాళన చేయడం ఆ ప్రాజెక్టు లక్ష్యమని.

నీటిని శుభ్రపరచాలి, మళ్లీ కలుషితమైన నీరు నదిలోకి రాకుండా చూడాలి అంటే నది పరిసరాలలో నివసించే ప్రజలపైన కొన్ని ఆంక్షలు పెట్టాలని అన్నారు. మూసీనదిలోకి ప్రవహించే మురికినీటిలో అధికభాగం నదిఒడ్డున ఉన్న వాడలనుండి వచ్చే నీరు కాదనీ, దూరప్రాంత కాలనీల నుండి, ఫ్యాక్టరీల నుండి వచ్చే నీరని ప్రజల తరఫున చేసిన వాదనకు వారినుండి జవాబు లేదు.

అదట్లా ఉంచి, కొంతకాలానికి అర్థమయిందేమిటంటే మూసీనదిని క్షాళన చేయడం అనేది నందవనం ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంకాదు. ప్రజల హక్కుల ఉల్లంఘనకు జవాబు చెప్పడానికి అది పనికొచ్చిందిగానీ అసలు సంగతి అది కాదు.


అసలు లక్ష్యం పారిశుద్ధ్యంతోనూ, పర్యావరణంతోనూ ముడిపడింది కాదు. రవాణా, టూరిజం ప్రయోజనాలు నందనవనానికి ప్రేరణ. క్రమంగా స్పష్టమవుతూ వచ్చిన ఈ సంగతి బాపూఘాట్ ప్రజలకిచ్చిన నోటీసులతో పూర్తిగా స్పష్టమయింది. చాదర్‌ఘాట్ దగ్గర నదిలో నిజంగానే కాలుష్యం చాలా ఉంది కాబట్టి చాదర్‌ఘాట్ సమీపంలోని నది ఒడ్డు ప్రాంతాలయిన కమల్‌నగర్, మూసానగర్ తదితర వాడలను తొలగిస్తామన్న బెదరింపును కాలుష్యంతో ముడిపెట్టడం పైకి చూడడానికైనా సబబనిపించగలదు. కానీ బాపూఘాట్ నగరానికి ఎగువన ఉన్నది. అక్కడ నదిలో కాలుష్యం చాలా తక్కువ.

బాపూఘాట్‌లో ఉన్న నలభై అయిదు ఇళ్ల ప్రజలను ఖాళీచేసి వెళ్లిపోవలసిందిగా ప్రభుత్వం నోటీసులు జారీచేస్తూ అసలు సంగతి చెప్పేసింది. నగరం తూర్పునుండి పడమటికి మూసీనది ఒడ్డున ఉద్యానవనం నిర్మించడం, నది అంచున (నదిలోపలే) విశాలమైన రహదారి నిర్మించడం ప్రభుత్వం ప్రధాన లక్ష్యం.

రహదారి ఎందుకంటే కర్నాటక, మహారాష్ట్రల నుండి సర్కారు జిల్లాల వైపు పోయే లారీలు, ఇతర వాహనాలు నేరుగా విజయవాడ దారి పట్టడానికి. ప్రస్తుతం రాత్రి అయ్యేదాకా ఆగి నగరం లోపలి నుంచి నగరాన్ని దాటాలి, లేదా రింగ్‌రోడ్డెక్కి చుట్టూ తిరిగిపోవాలి. నదిలో కాలుష్యం గురించి మాట్లాడే వాళ్లు నది అంచున దూరప్రాంత లారీల ప్రయాణానికి రహదారి నిర్మించడానికి పూనుకోవడం విచిత్రమనిపించకమానదు.

రహదారి ఎంత ముఖ్యమో అంతే ముఖ్యం ఉద్యానవనం, ఇది నది రెండు వైపులా హిమాయత్‌సాగర్ నుండి నాగోల్ దాకా నెలకొంటుంది. దీని లక్ష్యం పర్యాటకులను ఆకర్షించడం. 'స్వర్ణాంధ్ర ప్రదేశ్' స్థాపనకు చోదక శక్తులుగా పనిచేయగల పెట్టుబడి రంగాలలో టూరిజం ఒకటి కాబట్టి నది ఒడ్డున పార్కు ఏర్పాటు కోసం అక్కడ ప్రస్తుతం నివసిస్తున్న ప్రజలను బలప్రయోగంతో తొలగించడం స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు అవశ్యమే.

హైదరాబాద్ నగర పాలకులకొక పెద్ద వ్యూహం ఉందని గమనించలేని బాపూఘాట్‌వాసులు 'మా అమాయకత్వం



వల్లనే ఈ పరిస్థితి కొనితెచ్చుకున్నాం' అని వాపోతున్నారు. ఈ అభిప్రాయం వెనుక ఒక కథ ఉంది. మహాత్మాగాంధీ చనిపోయినప్పుడు ఆయన చితాభస్మాన్ని కాంగ్రెస్‌వారు దేశంలోని అనేక నదులలో కొంచెం కొంచెం కలిపి సమాధులు కట్టారు. ఆ విధంగా పుట్టింది బాపూఘాట్ అనే చిరుసమాధి.

కాలక్రమంలో గాంధీని మరచిపోయినట్టే మూసీనది ఒడ్డున ఉన్న ఆయన సమాధినికూడా మన పాలకులు మరచిపోయారు. కొన్ని ఏళ్లక్రితం ఆ సమాధి దగ్గర నివసిస్తున్న ప్రజలే అప్పటి రాష్ట్ర గవర్నర్ కృష్ణకాంత్‌గారికి దానిని జ్ఞాపకంచేసి, బాపూకు తగిన ఘాట్ తయారు చేయాలని కోరారు. గాంధేయవాదిగా తనను తాను భావించుకునే కృష్ణకాంత్ అక్కడ బాపూఘాట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి అందంగా కట్టించారు. ఇప్పుడు ప్రభుత్వం బాపూఘాట్‌ను ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లాగా ఒక పర్యాటక కేంద్రంగా మార్చదలచుకుని అక్కడ ఉంటున్న 45 కుటుంబాలను ఖాళీచేసి పొమ్మంటున్నది. ఇది మా తెలివితక్కువతనం అని ఆ ప్రజలు తలలు పట్టుకుంటున్నారు గానీ నిజానికి అక్కడ బాపూ సమాధి ఉన్నా లేకున్నా వారికి ఖాళీ చేయమన్న తాఖీదులు వచ్చేవే.

పెట్టుబడి పెడితే ఇతోధికంగా ఆదాయం ఇవ్వగల వనరులేవీ పేదల దగ్గర ఉండనీయకూడదనేది చంద్రబాబు నమ్మే అభివృద్ధి పంథాకు కేంద్ర భావన. ఆ 45 కుటుంబాలు అక్కడే ఉంటే ఏమొస్తుంది? వాళ్లు కొంచెం హాయిగా బతుకుతారు. మూసీ నదిమీద అప్పుడప్పుడు వీచే చల్లనిగాలిని అనుభవిస్తారు. వాళ్ల పిల్లలు కొంచెం ఆరోగ్యంగా పెరుగుతారు. కానీ రాష్ట్ర ఆదాయం పెరగదుకదా? వాళ్లను అక్కడినుండి తరిమేసి కర్మన్‌ఘాట్‌లోనో, గుడిమల్కాపూర్‌లోనో వదేసినా వారు అంతే ఉత్పత్తి చేస్తారు. వాళ్లవల్ల రాష్ట్రం అంతే ఆదాయం పొందుతుంది.

కానీ వాళ్లు ఉంటున్నచోట ఉద్యానవనం తయారుచేసి గాంధీ సమాధి పేరిట టూరిస్టులను ఆకర్షిస్తే —అందుకోసం పెట్టుబడి పెడితే —అదనంగా చాలా ఆదాయం లభిస్తుంది. 2020 నాటికి అందుకోవలసిన 10 శాతం పెరుగుదల రేటుకు రాష్ట్ర ఆదాయం కొంచెం చేరువ అవుతుంది. ప్రజల బాగోగులతో నిమిత్తం లేకుండా 'రాష్ట్ర ఆదాయం' పెరుగుదలను ప్రమాణంగా పెట్టుకున్న చంద్రబాబు 'విజన్'నుండి పుట్టింది మూసీ ఆధునీకరణ ప్రణాళిక అయిన నందనవనం.

మూసీ నదిఒడ్డున నివసించే పేదలను దూరప్రాంతాలకు తరిమేసినా వాళ్లు అంతే శ్రమచేసి రాష్ట్ర ఆదాయానికి అంతే సమకూరుస్తారనేది నిజం కాదన్న సందేహం రావచ్చు. గతంలో చాదర్‌ఘాట్ సమీపంలోని మూసానగర్, కమల్‌నగర్, శివాజీనగర్ ప్రజలను ఊరి బయట కర్మన్‌ఘాట్‌కు తరిమేసినప్పుడు, అక్కడ పనులు దొరకక, ఇంత దూరం నగరంలోకి వచ్చి పనులు చేసుకోలేక కొంతమంది నిరుద్యోగులయిపోవలసి వస్తుందన్న విమర్శ వినవచ్చింది. ముఖ్యంగా అప్పటిదాకా బయటకు పోయి పనిచేస్తున్న స్త్రీలలో కొంతమందయినా ఇంటి నాలుగు గోడలకు పరిమితమయిపోయే పరిస్థితి వస్తుందని చాలామంది ఆందోళన వ్యక్తం చేశారు.

ఇది నిజమే. అయినప్పటికీ అందువల్ల తగ్గిపోయిన 'రాష్ట్ర ఆదాయం' కంటె నదీతీర ప్రాంత రహదారివల్ల, పర్యాటక కేంద్రాల అభివృద్ధి వల్ల పెరిగే ఆదాయం ఎక్కువ ఉంటుందని నగర ప్రణాళికా నిర్ణేతలు భావించి ఉండవచ్చు. అంతకంటే ముఖ్యంగా ఉపాధి అవకాశాలు కొద్దిమంది తాత్కాలికంగా కోల్పోయినా ఏదో ఒకటి చేసి మళ్లీ సంపాదించుకోక చస్తారా అన్న ధీమాకూడా పాలకులలో ఉండే ఉంటుంది. కాబట్టి ఏ రకంగా చూసినా మూసీఒడ్డునుండి వీరందరిని తరిమేసి పార్కులూ, ఉద్యానవనాలూ, అందులో షాపింగ్ కాంప్లెక్స్‌లూ, నదీజలక్రీడల కేంద్రాలు నిర్మించడం చంద్రబాబు నమూనా అభివృద్ధికి తగిన ఆలోచనే.

కొన్ని దశాబ్దాల క్రితం మద్రాసు నగరంలో బీచ్‌ను అనుకుని నివసిస్తున్న గుడిసెవాసుల తొలగింపు కోసం కూడా ఇటువంటి డిమాండ్ ముందుకొచ్చింది. వాళ్లకు 'ఇంకెక్కడైనా' ప్లాట్లు ఇచ్చి సముద్రతీరాన్ని అందంగా తీర్చిదిద్దితే మద్రాసు ఒక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది కదా అని ఆ నగరంలోని పెద్దమనుషులు వాదించారు. అప్పటికింకా సరళీకరణ, ప్రపంచీకరణ వాదాలు బలపడలేదు. అంతేకాదు, ప్రకృతి పేదలకు కూడా సమానంగా చెందుతుందని నమ్మడానికి సిద్ధంగా ఉన్న రాజకీయ నాయకులు అప్పట్లో ఉన్నారు. డి.ఎం.కె. పార్టీ తరఫున తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న అన్నాదురై సాహసించి బీచ్ వెంబడి ఉన్న గుడిసెవాసులకు అక్కడే రెండు మూడు అంతస్తుల అపార్ట్‌మెంట్లు కట్టిచ్చాడు. మిగిలిన బీచ్‌ను పర్యాటకుల కోసం అభివృద్ధి చేశాడు. పేదల పిల్లలకు కూడా బీచ్ దక్కింది. అందువల్ల ఆ బీచ్‌కు రాకుండాపోయిన వారు రాకపోతేనేం అనుకోగల రాజకీయ వాతావరణం అప్పట్లో ఉంది.

మూసీ పరిసరవాసులు రెండేళ్లుగా ఈమాటే అంటున్నారు. మాకు రెండస్తుల్లో, మూడంతస్తుల్లో అపార్ట్‌మెంట్లు కట్టి తలా ఒక ఫ్లాట్ ఇవ్వండి. అప్పుడు చాలా జాగా ఖాళీ అవుతుంది కదా, అక్కడ పార్కులు వగైరా కట్టుకోండి. మీకు కావాల్సిన టూరిస్టులు వస్తారు, మా పిల్లలు ఆడుకుంటారు. మేము ఇప్పటిలాగే మా పని స్థలాలకు దగ్గరగా ఇప్పటికంటే మరింత ఆరోగ్యంగా బతుకుతామని అంటున్నారు.

ఎవ్వరూ అహేతుకమనలేని ఈ సూచన ఎవరి చెవినా ఎందుకు పడడం లేదు? ఆదాయమిచ్చే నదిఒడ్డు భూమి ఒక్కంగుళమైనా వీరికెందుకివ్వాలనా? ఈ జిడ్డోడుతున్న ముఖాలు కనిపిస్తుంటే టూరిస్టులు రారనా? ఈ సంగతి స్పష్టంగా చెప్పేస్తే ఇది ఎవరి ప్రభుత్వమో, ఇది మాట్లాడే స్వర్ణాంధ్రప్రదేశ్ ఎవరికి స్వర్ణమో స్పష్టమయిపోతుంది కదా?